**Sakshi**

# 248 అకడమిక్ అసిస్టెంట్ల నియామకాలు

**ఆర్‌జీయూకేటీ ఉపకులపతి రామచంద్రరాజు**

**వేంపల్లె:** ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలలో 248 అకడమిక్ అసిస్టెంట్ల నియామకాలు చేపడుతున్నట్లు ఆర్‌జీయూకేటీ వైస్ చాన్సలర్ రామచంద్రరాజు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలోని అతిథిగృహంలో జీసీ మెంబర్ వెంకయ్య, డైరెక్టర్లు భగవన్నారాయణ, విశ్వనాథరెడ్డి, ఏవో అమరేంద్ర పండ్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కొండారెడ్డి, రత్నకుమారిలతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి జనవరి 4, 5 తేదీల్లో ఇక్కడ జరగనున్న స్నాతకోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్నారని తెలిపారు. చాన్సలర్ రాజ్‌రెడ్డి ప్రతి డిసెంబర్‌లో ఇక్కడ సమీక్ష నిర్వహించేందుకు వస్తారన్నారు. అందులో భాగంగా ఇక్కడికి వచ్చారని.. అయితే అనివార్య కారణాలతో బెంగళూరుకు వెళ్లారని



తెలిపారు. ప్రధానంగా అకడమిక్ విషయాలు, తరగతుల నిర్వహణ, సిలబస్, ఉపాధిపై సమీక్షించామన్నారు. ఇంటర్న్‌షిప్‌కు సంబంధించి కేవలం స్టయిపెండ్ ఇస్తారని, మిగతా ఖర్చులు తల్లిదండ్రులు పెట్టుకోవాల్సి ఉన్నందున ఇబ్బందులు పడుతున్నారని విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, దీనిపై గవర్నింగ్ కౌన్సిల్ భేటీలో చర్చిస్తామన్నారు. ప్రస్తుతం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఏడు డిపార్ట్‌మెంట్లకు సంబంధించి రూ.100 కోట్లతో చేపట్టిన బ్లాక్‌ల పనులు 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. జర్మనీకి చెందిన సిమన్స్ కంపెనీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ట్రిపుల్ ఐటీలలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసిందని, సోమవారం చాన్సలర్ రాజ్‌రెడ్డి ప్రారంభించారన్నారు. ఇక్కడ ఉన్న ఫ్యాకల్టీకి సిమన్స్ కంపెనీ ప్రతినిధులు శిక్షణ ఇస్తారన్నారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీకి సంబంధించి స్థల సేకరణ ఇంకా పూర్తికాలేదన్నారు.